# ఆకలి




**వాలా సేపట్నించి చూస్తున్నాను — వాడిచూపులు టేబుల్ మీదే. ఆత్రుతగా, ఆపేక్షగా మాటి మాటికి చేస్తున్న పని ఆపి అటు కేసి చూస్తున్నాడు.**

గుర్విరెడ్డి కంపోజింగ్ ఎడిట్ చేస్తూనే ఏదేదో మాట్లాడుతున్నాడుగాని నా దృష్టి ఓ వైపు వాడికేసే వుంది.

పెళ్ళిళ్ళ సీజన్ కాబట్టి రెండు చేతులా పని వుంది. సంపాదన వుంది.

మేము కలవక చాలా రోజులైంది. ఇప్పుడు కలసినా తన మనస్సును పూర్తిగా నా వశం చేయలేక పోవడంతో స్మృతులు కొన్ని లోపలే అణగివున్నాయి. అందుకే నా చూపులు అటు ఇటు తారట్లాడేది.

వాడిని గురించి నేనంతగా గమనించవలసిన పరిస్థితి రాదుగాని మధ్యాహ్నం హోటల్ భోజనంతో వచ్చింది. రెండు మీల్స్ పాకెట్లు తెప్పించాడు గుర్విరెడ్డి. అందంగా న్యూస్ పేపర్‌లో ప్యాక్ చేసి వున్నాయి అవి.

ప్యాకెట్లు టేబుల్ మీద వుంచి పనిలోకి నడిచాడుగాని చూపుల్ని వెంట తీసికెళ్ళడం మరిచాడు వాడు. అవింకా ప్యాకెట్లను అంటిపెట్టుకునే వున్నాయి.

ప్రెస్సులో చిన్న చిన్న పనులు చేసిపెట్టేందుకు వాణ్ణి వుంచుకొన్నాడుట గుర్విరెడ్డి.

చిరుగుల గుడ్డలో దాగిన వాడి లేత వయస్సు నాకు జాలిగొలిపింది. బీదతనం వాడి జీవితాన్ని కాటేసింది కాబట్టే చదువుకునే వయస్సులో సంపాదనకు దిగాడు. పాపం.

అన్నం ప్యాకెట్ల కేసి తేపతేపకు తుమ్మెదల్లా ఎగిరొచ్చే వాడి చూపుల్ని చూస్తోంటే 'ఎంత ఆకలిగొన్నాడో పాపం?' అన్పించింది.

పని ఆపేసి వర్కర్స్‌ను భోజనానికి పంపాడు గుర్విరెడ్డి. వాడు మా వద్దనే వుండిపోయాడు.

గ్లాసుల్లో నీళ్ళు సర్దాడు — టేబుల్ మీద.

మీల్స్ ప్యాకెట్లు విప్పుతూ వాడి వేపు చూశాను. చాలా ఆందోళనతో కూడిన ఆత్రుత కన్పించింది వాడి కళ్ళలో.

తినేందుకు ఉపక్రమించాము ఇద్దరమూ — మాటల్ని నంజుకొంటూ.

వాడికేసి చూడాలంటే నా కిష్టం లేదు. అయినా ఏవో అదృశ్య వీక్షణాలు వీపులోంచి దూసుకొచ్చి అన్నంలోకి దిగుతున్నట్లుగా అన్పిస్తోంది.

విస్తట్లో అన్నం మిగిల్చి లేస్తోన్న నన్ను ఆశ్చర్యంగా చూశాడు గుర్విరెడ్డి.

"ఏమయ్యా అన్నం మిగిల్చినవ్? తినవయ్యా! ఈ వయస్సులో ఈ కొద్ది అన్నమే ఎక్కువైందా? భలేవాడివే. ఒక్క వూపుకే లేచిపోవాలయ్యా — ఈ ప్యాకెట్టంతా" అన్నాడు నవ్వుతూ.

"వాడి కోసం వుంచాను. పాపం ఆకలిగొన్నట్లున్నాడు" చెప్పాను ఇంగ్లీషులో.

"వాడిక్కావాలంటే డబ్బులిద్దాంలే. హోటల్‌లో తినొస్తాడు. కడుపు కాల్చుకొంటావా? భలేవాడివే!" అన్నాడు.

"నాక్కూడా తినాలనిపించట్లేదులే" అంటూ లేచాను.

గుర్విరెడ్డిలేస్తూ, "రేయ్! ఆ అన్నం తినరా" అన్నాడు.

"నా కొద్దు సార్. నే నింటికాడ తింటా."

"ఇక్కడ తిను. ఇంటికాడ కూడా తిను. ఫర్వాలేదులే" అన్నాడు.

"లేదు సార్! నా కోసం మా అమ్మ కనిపెట్టుకొనుంటది. ఇద్దరం కల్సి తినాల" చెప్పాడు వాడు.

నాకు చాలా ఆశ్చర్యమేసింది.

మరి ... ఆ చూపులెందుకు?

"అయితే... అవి బైట పారెయ్" టేబుల్ వైపు చూపుతూ చెప్పాడు.

వాడు పేపర్‌తో సహా విస్తర్లను జాగ్రత్తగా మడిచి పట్టుకొన్నాడు. బైట వాటిని పారేయకుండా నెమ్మదిగా గోడకింద పెట్టి వచ్చాడు.

వాడి ప్రవర్తన నాకు విపరీతమైన ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

కిళ్ళీ నములుతూ ఓ కంట వాడిని గమనిస్తోన్నా.

వాడి చూపులు ఇంకా గోడ కింది నుంచి విడిచి రాలేదు.

నా చూపులేసిన దారి మీంచి వాడి ప్రవర్తనను గమనించినట్లున్నాడు గుర్విరెడ్డి. ఆయనకూ క్యూరియాసిటీ పెరిగింది.

అంతలో దారిన అటుగా వెళ్తోన్న కుక్క ఒకటి పులి విస్తర్ల వాసన పసిగట్టి అమాంతం వాటి మీదకు ఎగబాకింది.

కుక్కను చూస్తూనే వజవజ వణికాయి వాడి చూపులు. అది విస్తర్ల మీదకు దండెత్తగానే మమ్మల్ని కూడా గమనించకుండా అమాంతం దానికేసి పరువెత్తాడు.

కుక్కను అదిలిస్తున్నాడు.

అది గయ్‌మని లేస్తోంది.

మాకేదో ప్రపంచ వింతను చూస్తున్నట్లుగా అన్పిస్తోంది.

అన్నం తినమన్నా వద్దన్నవాడు పారేసిన విస్తర్ల కోసం ఎగబడుతున్నాడంటే — ఆ మనస్తత్వం ఏమిటో తలబద్దలు కొట్టుకొన్నా నాకు అర్థం కావట్లేదు.

అరుపుల్తో అదరగొట్టి, కాళ్ళతో తన్నీ కుక్కను తరిమాడు వాడు. అన్నం విస్తరిని పక్కకు లాగాడు. మిగిల్చిన అన్నమంతా నేలపాలైంది.

గుడ్లప్పగించి చూస్తున్నాను నేను.

ప్యాకెట్‌కు ప్యాక్ చేసిన న్యూస్ పేపర్‌ను శ్రద్ధంగా బైటకు లాగాడు ఎక్కడా చిరగకుండా.

నాకు ఆశ్చర్యం అంతకంతకూ రెట్టింపవుతోంది.

ఈ కాగితం కోసమా వీడింత పాటుబడిందీ? ప్యాకెట్లను చూపుల్తో పహారా కాసిందీ, కుక్కతో యుద్ధం చేసిందీ?

"అన్నానికి పోతున్నా సార్!" బైట్నించే కేకేశాడు వాడు.

ఆ కాగితంలో ఏముందో చూడాలనే కోరిక నా మనస్సులో బ్రహ్మాండమంతైంది.

గ్రహించినట్లున్నాడు గుర్విరెడ్డి. "రేయ్! ఏముందిరా ఆ పేపర్‌లో!" అన్నాడు.

వాడు సిగ్గు అభినయిస్తూ పేపర్‌ను పై వైపు రెండు చేతులా పట్టుకొని మా కళ్ళ ముందు ఆడించి తుర్రుమన్నాడు అక్కణ్ణించి.

కుర్చీలో అలాగే వెనక్కి చేరగిలబడ్డాను నేను.

ఓ చేత్తో మెషిన్ గన్‌నూ, మరో చేత్తో హీరోయిన్‌నూ పొదివి పట్టుకొని పైన వెళ్తోన్న విమానం కేసి తీక్షణంగా చూస్తూ నిల్చొనున్న ఓ సినిమా హీరో బొమ్మతో నిండిన పేపర్ అది!

—సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి